క్లుప్తంగా

నేడు 'ఆసరా' మెగా చెక్కు పంపిణీ

తలుపుల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా నగదు ఖాతాల్లో జమ చేయడానికి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి మెగా చెక్కు విడుదల చేయనున్నట్లు ఎంపీపీ రఫినాయక్, ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు.

అయ్యప్పస్వామి ప్రతిమ వితరణ



ప్రతిమను అందజేస్తున్న తహసీల్దార్ శ్రీధర్

ఓడీ చెరువు: మండలంలోని ఎం.కొత్తపల్లిలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయానికి తహసీల్దార్ శ్రీధర్ అయ్యస్వామి రాతిశిల మూల విరాట్ ప్రతిమను సోమవారం ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడుకి అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురోహితులు సురేష్ శర్మ అయ్యస్వామి ప్రతిమకు విశిష్ట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తమండలి సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, పిట్టా ప్రభాకర్‌రెడ్డి,టైలర్ నిజాంవలి,ఏపీడీ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ హరి ప్రకాష్‌రెడ్డి, ఏపీడీ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, వీఆర్వో లోకే శ్వరి, నరసింహులు, శివప్ప, మల్లెల రమేష్, వీఆర్‌ఏ రంగప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

కదిరి అర్బన్: పట్టణంలో చర్మకారవృత్తి చేసుకుని జీవించే పలువురికి సోమవారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ఎండవేడికి ఇబ్బందులు పడకుండా తన వంతు సాయంగా కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ అధ్యక్షులు రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాదాపీర్, పురుషోత్తం నాయక్, లక్ష్మీదేవీ, నరసింహులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందేలా చూడండి

కొత్తచెరువు: అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందే విధంగా చూడాలని పుట్టపర్తి సీడీపీఓ గాయత్రి తెలిపారు. సోమవారం కొత్తచెరువు-4 సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు ఎర్రమ్మ, పుష్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు



అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవస్వామి

తాడిమర్రి: మండల కేంద్రంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. వెండి ఆభరణాలు, వివిధ పుష్పాలతో మామిడి తోరణాలతో చక్కగా, అందంగా అలరింకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఘనంగా కుంభగుడి మహోత్సవం



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

నల్లచెరువు: మండల కేంద్రంలోని యోగి వేమన ఆలయంలో సోమవారం కుంభగుడి మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు ఏటా ఆనవాయితీ ప్రకారం పూజ అనంతరం కుంభగుడి మహోత్సవంలో దేవరపోతును బలి ఇచ్చి మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు మాట్లాడుతూ వారం రోజుల పాటూ స్వామివారి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, సర్పంచ్ పంచరత్నమ్మ, నాయకులు ఉత్తన్న, కల్లిపల్లి శ్రీనివాసులు, కర్ణం నాగభూషణ, ప్రహ్లాదరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రామాంజనేయులు మాజీ ఎంపీటీసీ రమణ, శేఖర్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పబ్లిక్ పరీక్షలు



కదిరిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పుట్టపర్తిలోని ఓ కేంద్రం వద్ద నంబర్లు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కదిరి అర్బన్: పట్టణంలోని 12 కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి తెలుగు పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మశానంపేట పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి పరిశీలించారు. 12 కేంద్రాల్లో 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ చెన్నక్రిష్ణ తెలిపారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కటారుపల్లి కస్తూరిబా గాంధీ పాఠశాలలో సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గాండ్లపెంట, కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో తెలుగు పరీక్షకు 337 మందికి గాను గాండ్లపెంట పరీక్ష కేంద్రంలో ప్రైవేటు విద్యార్థి గైర్హాజయ్యాడు. పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు.

ఎన్‌పీకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ధనియానిచెరువు, టీఎస్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 196 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి పరీక్షకు 192 మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ చీఫ్ అధికారి ప్రసాద్, డీఓ నారాయణస్వామి తెలిపారు.

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో నిర్వహించిన పదవ తర గతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతగా జరిగాయి. స్థానిక ఉన్నత పాఠశాలలో 223 మంది విద్యార్థులకు గానూ 221 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ భాస్కర్ తెలిపారు. కేజీబీవీలో 160 మంది విద్యార్థులకు గానూ 160 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ లలితమ్మ పేర్కొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూరిబాయి బాలికల విద్యాలయంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. మొదటి రోజు పరీక్షకు మొత్తం 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ తిరుపాల్ నాయక్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ధర్మవరం: పట్టణంలో పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయని ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. 15 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,539 మంది విద్యార్థులకుగాను 12 మంది గైర్హాజరయ్యారు. 2,527 మంది పరీక్షలకు హాజరయ్యారు. పలు కేంద్రాల్లో తాగునీటి సమస్య ఉండటంతో అప్పటికప్పుడు తాగునీరు వసతి కల్పించేలా ఆర్‌జేడీ చర్యలు చేపట్టారు. పరీక్షల నియమ నిబంధనలు అందరూ పాటించాలని తెలిపారు. ఎక్కడా లోపాలు లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

తాడిమర్రి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షలు జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మొత్తం 199 మంది విద్యార్థులకు గాను 196 మంది పరీక్షలు రాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు.అదే విధంగా కస్తూర్బా పాఠశాలలో మొత్తం 94 మంది విద్యార్థులకు గాను 91 మంది పరీక్షలు రాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా గుండప్ప, నాగరత్నమ్మలు వ్యవహరించారు.

ఐదుగురు గైర్హాజరు

బత్తలపల్లి: పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. బత్తలపల్లిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలోని మూడు కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. 483 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 478 మంది హాజరైనట్లు ఎంఈఓ చాముండేశ్వరి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో ముగ్గురు, బాలికల ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల కేంద్రంలో ఒక్కొక్కరు చొప్పున ఐదు మంది గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్‌లు ఉమాపతి, ముకుంద నాయుడు, జగన్‌మోహన్‌లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ యుగేశ్వరిదేవి, స్క్వాడ్ ఆనంద్, ముదిగుబ్బ ఎంఈఓ సుధాకర్‌నాయక్‌లు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. వైద్యాధికారిణి తేజశ్రీ మూడు కేంద్రాలను తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

తొమ్మిది మంది గైర్హాజరు

నల్లమాడ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సోమవారం తొలిరోజు నల్లమాడలో తొమ్మిది మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల పరీక్షా కేంద్రంలో 198 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఎనిమిది మంది, కస్తూరిబా పాఠశాల కేంద్రంలో 110 మందికి గాను ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్‌లు రమణ, చెన్నకేశవప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాల పరీక్షా కేంద్రంలో ఎంఈఓ వేమనారాయణ సిట్టింగ్ స్క్వాడ్‌గా పర్యవేక్షించారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ వలీబాషా ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా పది పరీక్షలు

ఓడీ చెరువు: మండల కేంద్రంలో సోమవారం పదవ తరగతి పరీక్షలను కట్టుదిట్టమైన భద్రత మధ్య పకడ్బందీగా నిర్వహించారు. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు సంబంధించి జిల్లా విద్యాధికారి మీనాక్షి హాజరై మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 290 మందికి గాను 288 మంది, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 218 మందికి గాను 214 మంది, శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 260 మందికి గాను 258 మంది హాజరైనట్లు ఆయా పాఠశాలల ఎగ్జామ్ చీఫ్‌లు రవీంద్రనాయుడు, సతీష్, బషీరుద్దీన్ తెలిపారు.

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా 4 కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 156 మందికి 156 మంది హాజరయ్యారు. అలాగే బాలికల ఉన్నత పాఠశాలలో 170 మందికి గాను 166 మంది హాజరయ్యారు. అదే విధంగా విశ్వభారతి పబ్లిక్ పాఠశాలలో 190 గాను 190 మంది హాజరయ్యారు. పీవీఎస్ పాఠశాలలో 121 మందికి గాను 121 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

385 మంది హాజరు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో మొత్తం 390 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ నటరాజ్, ఎంఈఓతో కలిసి పర్యవేక్షించారు.

సజావుగా పరీక్షలు

కొత్తచెరువు: 10వ తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. మండల కేంద్రమైన కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, శ్రీవిద్య పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో 240 మందికిగాను 237 మంది, బాలికల పాఠశాలలో 198 మందికిగాను 197 మంది, శ్రీవిద్య పాఠశాలలో 96 మందికిగాను 93 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఇఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. 7 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలియజేశారు.

కనగానపల్లి: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. కనగానపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్, మోడల్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 377 మంది విద్యార్థులు సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన అంకరాజు అనే వ్యక్తి ఇటీవల ప్రమాదవు శాతు ఆటో కింద పడి మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, డి. చెర్లోపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణమనాయుడులు ఇరువురు కలిసి లక్ష రూపాయలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న విదేశీ భక్తురాలు

నల్లమాడ: భగవాన్ సత్యసాయి బాబా భక్తులైన విదేశీ దంపతులు సోమవారం మండలంలోని అప్పయ్యగారిపల్లిలో ప్రజలకు నిత్యావసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. బియ్యం, కంది బేడలు, సబ్బులు, వంటనూనె తదితర నిత్యావసర సరుకులతో పాటు చీర, పంచె అందజేశారు. కార్యక్రమంలో సోమగుట్ట సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై ఫిర్యాదు

కనగానపల్లి: పాఠశాల నిధులను దుర్వినియోగం చేసిన చంద్రాశ్చర్ల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన ప్రమీలపై చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పాఠశాల పీసీ చైర్మన్ అమరేశ్వరరెడ్డి కమిటీ సభ్యులతో కలసి ఎంపీడీఓ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు 2021-22 విద్యా సంవత్సరంలో పాఠశాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 వేలు హెచ్‌ఎం ప్రమీల దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓతో పాటు ఎంఈఓ అరుణమ్మను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుర్లపల్లి నరసింహారెడ్డి, పీసీ కమిటీ సభ్యులు రమణ, అక్కులప్ప, సుకన్య, ఆదెమ్మ, నాగేష్, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం

పెనుకొండ రూరల్: కియా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ, సెబ్ సీఐ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. మొత్తం 70 కేసుల కర్ణాటక మద్యంతో పాటు మన రాష్ట్రానికి చెందిన రెండు కేసుల మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశామన్నారు. ఈ మద్యం విలువ రూ. 2,69,500 ఉంటుందని చెప్పారు.

పరిశుభ్రమైన నీటినే విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం: పరిశుభ్రమైన ఫిల్టర్ నీళ్లనే ప్రజలకు విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వాటర్ ప్లాంట్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా చేస్తున్న ఆటోలలో మైకు సౌండ్‌ను తగ్గించి నడపాలన్నారు. ఐఎస్‌ఐ మార్కు కలిగిన ఫిల్టర్లు మాత్రమే ఉపయోగించాలని, వాటిని క్రమం తప్పకుండా శుద్ధి చేయాలన్నారు. యంత్రాలను రెగ్యులర్‌గా శుద్ధి చేయాలని, నీటిని నిల్వ ఉంచే ట్యాంకులను శుభ్రం చేయాలని తెలిపారు. ప్రతి వాటర్ ప్లాంట్ నిర్వాహకులు మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వాటర్ ప్యాకెట్ల నిషేధం ఉందని, వాటి తయారీని తక్షణమే నిలిపివేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, వాటర్ ప్లాంట్ ఓనర్లు, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని టెంపుల్ జోన్‌గా ప్రకటించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పట్టణవాసులు

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడానికి వచ్చే దేశ విదేశీ భక్తులకు ప్రశాంతతకు నిలయంగా ఉన్న పుట్టపర్తి పట్టణాన్ని టెంపుల్ జోన్‌గా ప్రకటించాలని పలువురు పట్టణ ప్రముఖులు జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్‌కు సోమవారం విన్నవించారు. ఇటీవల పట్టణంలోని ఆలయాలు కొలువైన ప్రాంతంలో ఒక సంఘటన చోటు చేసుకొని ఆలయాల్లోకి చెప్పులు, రాళ్లు పడ్డాయన్నారు. సత్యసాయి బాబా నడయాడిన ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా టెంపుల్ జోన్‌గా ప్రకటించాలని కోరారు. పుట్టపర్తి ప్రశాంతతను, పవిత్రతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కోటా సత్యనారాయణ, కొండమరాజు, సతీష్ నాయక్, కడపరాజా, బాబుల్‌రెడ్డి, రఘు, బాబు రెడ్డి, సాయి, కత్తిరాజారెడ్డి, సామకోటి ఆదినారాయణ, సామీర్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



ప్రచార మెటీరియల్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి అర్బన్: సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తెలియజేసే 'మానమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి పేర్కొన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఒకటి, రెండు, మూడో సచివాలయాల పరిధిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీ నుంచి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, కౌన్సిలర్లు, వార్డు సారథులు పెద్ద ఎత్తున విచ్చేసి కుటుంబాలకు అందించిన లబ్ధిని గడప గడపకూ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సూర్యగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, రాజశేఖర్, ఫోటోసాయి, ఎస్‌టీడీ నరసింహులు, ,పైపల్లి నరసింహులు, గంగిశెట్టి, రామాంజనేయులు, వెంకటరాముడు, మోహన్ రెడ్డి, రమేష్, కడపరాజ, భాస్కర్ తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

ఈ నెల 7వ తేదీ నుంచి జరగనున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, అమగొండపాళ్యం సచివాలయాల పరిధిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నరసారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు అందించిన సంక్షేమ పథకాలు, కుటుంబాలకు అందిన లబ్ధిని గడపగడపకూ తిరిగి చెప్పాలన్నారు. ఈ యేడాది ప్రతి నాయకుడూ కార్యకర్త మరింత శ్రమించి 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరో సారి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లిఖార్జున, అగ్రి బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ కుల్లాయప్ప, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, సర్పంచులు వెంకటేషు, లీలావతి, రామచంద్ర, నాయకులు నరేష్, తిప్పారెడ్డి, ఆంజనేయులు, బయపరెడ్డి, కేశప్ప, రాగప్ప, నాగరాజు, తిమ్మప్ప, పకీరప్ప, గంగిరెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వతంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్దాం..

ఓడీ చెరువు: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ రాజునాయుడు, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ఆనందరెడ్డి అన్నారు. మండలంలోని టీ.కుంట్లపల్లి, ఇనగలూరు, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం సర్పంచులతో కలసి సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటా వెళ్లి తెలియచేసి వారికి ఎంత లబ్ధి చేకూరిందో తెలియ చేయాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి పథకాలను అందించేందుకు మనం కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీదేవి,బాబాఫకృద్దీన్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వెళ్లండి

కొత్తచెరువు: ఈ నెల 7వ తేది నుంచి 14వ తేదీ వరకు ప్రతి ఇంటిని వలంటీర్లు, గృహ సారథులు సందర్శించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని పోతుల కుంట బైరాపురం, బండ్లపల్లి, సచివాలయాల్లో వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాయా? లేదా? అన్న విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా అందకపోతే అలాంటి వారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్, మండల సచివాలయ కన్వీనర్ సాంబశివారెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బత్తలపల్లి: స్పందనలో ప్రజల నుంచి అందే సమస్యలపై దృష్టి సారించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవీ పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో ఆరు అర్జీలు అందినట్లు తెలిపారు. మూడు అర్జీలు భూ సమస్యలపైనే అందినట్లు తెలిపారు. రస్తా సమస్యపై రెండు, రోడ్డు విస్తరణలో కాశీవిశ్వనాథుని భూమికి పరిహారం గ్రామ పంచాయతీకి జమ చేయాలని అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

కూలీల సంఖ్య పెంచాలి

నల్లచెరువు: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎఫ్‌ఏ లను ఆదేశించారు. మండల వ్యాప్తంగా రోజువారి 6 వేల మంది పనులకు హాజరు కావాలని తెలిపారు. వారికి దినసరి కూలీ రూ.272 పడేలా కొలతలు ఇవ్వాలన్నారు. ఏపీఓ మంజుల తదితరులున్నారు.

పంచాయతీకి అద్దె చెల్లించకుండా రుబాబు

- పోలీసుల సాయంతో రూము ఖాళీ చేయించిన అధికారులు



రూము ఖాళీ చేయిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తచెరువు: పంచాయతీ రూమును వినియోగిస్తూ అద్దె చెల్లించకుండా 15 ఏళ్లుగా రుబాబు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసుల సాయంతో అధికారులు ఖాళీ చేయించారు. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో 49 పంచాయతీ కాంప్లెక్స్ రూములు ఉన్నాయి. వీటికి ఏటా వేలం పాట నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఓ వ్యక్తి 15 ఏళ్లుగా ఎటువంటి అద్దె చెల్లించకుండా ఓ రూంను వినియోగించుకుంటూ వస్తున్నాడు. 3 రోజుల క్రితం నిర్వహించిన వేలం పాటలో సదరు రూమును వేరే వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే రుబాబు చేస్తున్న వ్యక్తికి అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఏమ్రాతం పట్టించుకోలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శి గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేసి సోమవారం సాయంతం వారి సమక్షంలో రూము ఖాళీ చేయించారు. టీడీపీ చెందిన వ్యక్తి కావడంతో 15 ఏళ్లుగా నిరాటంకంగా రూమును తన ఆధీనంలోనే పెట్టుకొని లక్షలాది రూపాయల పంచాయతీ ఆదాయానికి గండి కొట్టినట్లు అధికారులు తెలియజేశారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ప్రతిమ (43) అనే మహిళ సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసున్నట్లు ఏఎస్‌ఐ ధనుంజయ తెలిపారు. మృతురాలి భర్త నరేంద్ర తెలిపిన వివరాలమేరకు... ప్రతిమ కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, వివిధ ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదన్నారు. దీంతో మనోవేదనకు గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సోమందేపల్లిలో దొంగతనం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని దుర్గా నగర్‌లో నివాసముంటున్న వెంకటేష్ నివాసంలో చోరీ జరిగింది. ఆదివారం తన భార్య నిర్మలతో కలిసి పెనుకొండ మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వారు వెళ్లారు. అయితే సోమవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా అప్పటికే తాళాలు తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రూ.6 వేల నగదు, వెండి ఆభరణాలు, గ్యాస్ సిలిండర్‌తో పాటు పట్టు చీరలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్‌ఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.